అక్షర దర్బార్
www.aksharadarbar.com
Voice of the people

# చారిత్రాత్మక నిర్ణయం

- ఒక్కరోజే 119 పంచాయతీల్లో “నో హెల్మెట్ –నో ఎంట్రీ” తీర్మానం!
- “సురక్షిత –గంజాయి రహిత ఆదర్శ గ్రామం” లక్ష్యంగా అడుగులు
- గంజాయి సమాచారం ఇస్తే రూ.5,000 నగదు బహుమతి.. జిల్లా ఎస్పీ
- గూడూరు గ్రామసభలో 'అరైవ్ అలైవ్' అవగాహన సదస్సు

02



గురువారం 11, జూన్ 2026 సంపుటి :03 సంచిక :121 పేజీలు :05 వెల ₹5

# 17న రాష్ట్రానికి నితిన్ నబీన్

- మూడు రోజుల పర్యటన షెడ్యూల్ ఖరారు
- హైదరాబాదులో రెండు రోజులు.. వరంగల్‌లో ఒకరోజు

అక్షరదర్బార్, హైదరాబాద్: భారతీయ జనతా పార్టీ (బీజేపీ) జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఈనెల 17న రాష్ట్రానికి రానున్నారు. బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన రాష్ట్రంలో పర్యటించడం ఇదే తొలిసారి కావడంతో పార్టీ శ్రేణులు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. రాష్ట్రంలో మొత్తం మూడు రోజుల పాటు ఆయన విస్తృతంగా పర్యటించనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.
తెలంగాణలో పార్టీని మరింత బలోపేతం చేయడం, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం చేయడమే లక్ష్యంగా ఈ పర్యటన సాగనుంది.

**- పర్యటన షెడ్యూల్**

తొలి రెండు రోజులు ఆయన హైదరాబాద్‌లోనే గడపనున్నారు. రాజధానిలో బీజేపీ నిర్వహించే వివిధ అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు, బీజేపీ రాష్ట్ర ముఖ్య నేతలతో కీలక భేటీలు జరుపుతారు. హైదరాబాద్‌లోనే జరగనున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి నితిన్ నబీన్ ముఖ్య అతిథిగా హాజరవుతారు. ఈ సమావేశంలో రాష్ట్రంలోని ప్రస్తుత రాజకీయ పరిణామాలు, ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజాపోరాటాలు, పార్టీ సంస్థాగత బలోపేతంపై దిశానిర్దేశం చేయనున్నారు. పర్యటనలో చివరి రోజైన మూడో రోజున నితిన్ నబీన్ వరంగల్ జిల్లాలో పర్యటించనున్నారు. వరంగల్ ఉమ్మడి జిల్లా పరిధిలోని కీలక నేతలతో సమావేశమై, ఇక్కడ పార్టీ భవిష్యత్ కార్యాచరణను సమీక్షిస్తారు.



# 2027 నాటికి సాగునీరు

- ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం
- లోపభూయిష్ట నిర్మాణం వల్లే బ్యారేజీ కుంగిందని గత ప్రభుత్వంపై మండిపాటు
- మేడిగడ్డ బ్యారేజీ సాంకేతిక పరీక్షల పనుల పరిశీలన

## వచ్చే ఎండాకాలం ఒకే సీజన్ లో మేడిగడ్డ పునరుద్ధరణ పూర్తి చేస్తాం



*గత ప్రభుత్వ తప్పుడు నిరయాలు, లోపభూయిష నిర్మాణాల వలే మేడిగడ్ బ్యారేజీ కుంగిపోయిందని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి నలమారి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. అయితే 2027 ఎండాకాలం నాటికి ప్రాజెక్టు మరమ్మతులు పూర్తిగా పూర్తి చేసి, రైతులకు సాగునీరు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు.*

– అక్షరదర్బార్, మహాదేవపూర్

02

# మేడారంలో 30 పడుకల హాస్పిటల్

- నిర్మాణం కోసం అవసరమైన స్థల సేకరణ ప్రక్రియ వెంటనే ప్రారంభించాలి
- జంపన్న వాగు పరిసరాలను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలి
- మేడారం అభివృద్ధి పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలి
- భక్తులకు ఏడాది పొడవునా శాశ్వత సౌకర్యాలు కల్పించాలి
- సమీక్షా సమావేశంలో అధికారులకు మంత్రి సీతక్క ఆదేశాలు



అక్షరదర్బార్, మేడారం : మేడారం సమ్మక్క–సారలమ్మ వనదేవతల ఆలయ ప్రాంగణాన్ని భక్తి భావం ఉట్టిపడేలా తీర్చిదిద్దాలని, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు.
బుధవారం తాడ్వాయి మండలం మేడారం హరిత హోటల్‌లో జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావుతో కలిసి ఆమె మేడారం అభివృద్ధి పనులపై ఉన్నత స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. మేడారం మహాజాతర ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీక. జాతర సమయంలోనే కాకుండా, ఏడాది పొడవునా వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులో ఉంచాలి. వనదేవతల ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో శాశ్వత నిర్వహణ కోసం అన్ని శాఖల సమన్వయంతో ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, దానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించాలి. రాబోయే గోదావరి పుష్కరాల సందర్భంగా మేడారానికి భారీగా భక్తులు వచ్చే అవకాశమున్నందున, ముందస్తుగా మౌలిక సదుపాయాలను కల్పించాలి. శాశ్వత స్నాన ఘట్టాలు, విశ్రాంతి గదులను దశలవారీగా నిర్మించాలని అన్నారు.

**30 పడకల ఆసుపత్రి**

మేడారంలో శాశ్వత ప్రాతిపదికన 30 పడకల ఆసుపత్రి నిర్మాణం కోసం అవసరమైన స్థల సేకరణ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలి. జంపన్నవాగు పరిసర ప్రాంతాన్ని పర్యాటక ఆకర్షణగా తీర్చిదిద్దేందుకు ఒక సమగ్ర ప్రణాళికను సిద్ధం చేయాలి. శాశ్వత మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలి. జాతర సమయంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ నిరంతరం పనిచేసేలా చూడాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

**వరద ముందస్తు చర్యలపై..**

రాబోయే వరదల నేపథ్యంలో ఇరిగేషన్ శాఖ అధికారులు గోదావరి నది పరివాహక ప్రాంతంలోని గ్రామాలు, లోతట్టు ప్రాంతాల పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని మంత్రి సూచించారు. సమీక్షా సమావేశం అనంతరం మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావుతో కలిసి వనదేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్పీ సుదీర్ రామ్నాథ్ కేకన్, ఐటిడిఏ పీవో లెనిన్ వత్సల్ టోప్పో, డీఎఫ్‌వో వికాస్ మీనా, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్ జీ, సంపత్ రావు, జిల్లా అధికారులు, ఆలయ పూజారులు పాల్గొన్నారు.

# కన్నకూతురి ప్రసవ సంబరంలో విషాదం

- వడదెబ్బతో తండ్రి మృతి!
- ఎల్లారెడ్డిపల్లిలో కన్నీరు మున్నీరవుతున్న కుటుంబ సభ్యులు
- ఆదుకోవాలన్న గ్రామస్తులు

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి (జూన్ 11): కూతురు ప్రసవించిందనే ఆనందంతో మనవరాలిని చూడటానికి వెళ్లిన ఓ తండ్రిని మండుటెండ వడదెబ్బ రూపంలో బలితీసుకుంది. మొగుళ్లపల్లి మండలం ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కల్లేపల్లి చంద్రమౌళి అనే వ్యక్తి వడదెబ్బ తట్టుకోలేక మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. గత శనివారం కరీంనగర్ జిల్లా హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో తన కూతురు కాన్పు కావడంతో, ఆమెను చూడటానికి చంద్రమౌళి వెళ్లారు. అయితే తీవ్రమైన ఎండవేడికి తట్టుకోలేక ఆయన మార్గమధ్యంలోనే వడదెబ్బకు గురై సొమ్మసిల్లి పడిపోయారు. గమనించిన స్థానికులు తక్షణమే ఆయనను మెరుగైన చికిత్స నిమిత్తం వరంగల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ అత్యవసర విభాగంలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం చంద్రమౌళి మృతి చెందారు. హఠాత్తుగా కుటుంబ యజమానిని కోల్పోయి రోడ్డున పడిన కల్లేపల్లి చంద్రమౌళి కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామ ప్రజలు వేడుకుంటున్నారు.

# ప్రభుత్వ కాలేజీల్లోనే చేరండి..

- బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోండి!
- శాయంపేటలో పరకాల జూనియర్ కళాశాల అధ్యాపక బృందం విస్తృత ప్రచారం

అక్షర దర్బార్, శాయంపేట (జూన్ 11): పదో తరగతి పాసైన విద్యార్థులందరూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనే చేరి తమ ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాదులు వేసుకోవాలని పరకాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రధానాచార్యులు, అధ్యాపక బృందం పిలుపునిచ్చింది. ఈ మేరకు శాయంపేట మండల కేంద్రంలో అధ్యాపకులు విస్తృతంగా పర్యటించి, ఇంటర్మీడియట్ ప్రవేశాల ప్రారంభంపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ కళాశాలల్లో ఉచిత ప్రవేశంతో పాటు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, చదువుకు సంబంధించిన ఇతర సామాగ్రి, ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం నాణ్యమైన భోజన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వివరించారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో పాటు విశాలమైన తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయం అందుబాటులో ఉన్నాయన్నారు. అలాగే ఉచితంగా వివిధ రకాల ఉన్నత విద్యా పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. వెనుకబడిన తరగతుల విద్యార్థులకు వంద శాతం విద్యార్థి వేతనం, వసతి గృహ వసతి ఉంటుందన్నారు. చేరదలచిన వారు పదో తరగతి మార్కుల పత్రం, బదిలీ పత్రం, ఆధార్ కార్డుతో సంప్రదించాలని అధ్యాపకులు పోడేటి రవీందర్, రాచకొండ రాజు, జడ చేరాలు కోరారు.

# ప్రజా రక్షణే పోలీసుల కర్తవ్యం

### ఇటుకాలపల్లి గ్రామసభలో

### ఈస్ట్ జోన్ పోలీస్ కమిషనర్ అంకిత్ భరోసా

అక్షర దర్బార్, నర్సంపేట (జూన్ 11): గ్రామాల్లో శాంతిభద్రతల సమస్యలు పూర్తిగా తొలగిపోతే, ఆ ప్రశాంతత క్రమక్రమంగా మొత్తం సమాజంపై సానుకూల ప్రభావం చూపుతుందని ఈస్ట్ జోన్ పోలీస్ డిప్యూటీ కమిషనర్ అంకిత్ అన్నారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నర్సంపేట మండలం ఇటుకాలపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామసభకు ఆయన హఠాత్తుగా విచ్చేసి ప్రజలతో నేరుగా ముఖాముఖి మాట్లాడారు. గ్రామ స్థాయిలో శాంతిభద్రతలకు భంగం కలిగించే అంశాలు గానీ, అంతర్జాల మోసాలు గానీ జరిగితే నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని గ్రామస్థులకు గట్టి భరోసా ఇచ్చారు. ప్రజలకు భద్రత కల్పించడమే తమ మొదటి కర్తవ్యం అన్నారు. వాహనదారులు ఇంటి నుండి బయలుదేరినప్పుడు క్షేమంగా తిరిగి రావాలనే నిబంధనలను పాటించాలని అధికారులు వివరించారు. అనంతరం సర్పంచ్ మెరుగు సుమలత శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఇటుకాలపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చి దిద్దడానికి గ్రామస్థులందరూ తమకు సహకరించాలని కోరారు. అర్హులైన లబ్ధిదారులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని సర్పంచ్ హామీ ఇచ్చారు.

# చారిత్రాత్మక నిర్ణయం

- ఒక్కరోజే 119 పంచాయతీల్లో "నో హెల్మెట్ –నో ఎంట్రీ" తీర్మానం!
- "సురక్షిత –గంజాయి రహిత ఆదర్శ గ్రామం" లక్ష్యంగా అడుగులు
- గంజాయి సమాచారం ఇస్తే రూ.5,000 నగదు బహుమతి.. జిల్లా ఎస్పీ
- గూడూరు గ్రామసభలో 'అరైవ్ అలైవ్' అవగాహన సదస్సు



అక్షరదర్బార్, మహబూబాబాద్: మహబూబాబాద్ జిల్లాలో రోడ్డు భద్రతా నియమాల అమలుపై అత్యంత కీలకమైన, చారిత్రాత్మక చర్యలు ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా సరికొత్త రికార్డు సృష్టిస్తూ ఒక్కరోజే 119 గ్రామపంచాయతీలు, 09 వార్డుల్లో "నో హెల్మెట్ – నో ఎంట్రీ" తీర్మానాలను స్థానిక పాలకవర్గాలు ఆమోదించాయి. "సురక్షిత – గంజాయి రహిత ఆదర్శ గ్రామం" లక్ష్యంగా జిల్లాను తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా ఎస్పీ డా శబరీష్. పి పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన గ్రామసభలో "అరైవ్ అలైవ్" కార్యక్రమం మరియు రహదారి భద్రతపై ప్రత్యేక అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ డా. శబరీష్ పి, గ్రామస్తులకు రహదారి భద్రత, గంజాయి నిర్మూలనపై విస్తృతంగా అవగాహన కల్పించారు. అనంతరం గ్రామ పంచాయతీ సిబ్బందికి ఆయన స్వయంగా హెల్మెట్లను పంపిణీ చేశారు. "రోడ్డు ప్రమాదాల్లో సంభవిస్తున్న ప్రాణ నష్టానికి అధిక శాతం హెల్మెట్ ధరించకపోవడమే కారణం. ప్రతి ద్విచక్ర వాహనదారుడు తమ ప్రాణాల రక్షణ కోసం తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి" అని జిల్లా ఎస్పీ శబరీష్ అన్నారు.

**- ఏకగ్రీవ తీర్మానాలకు జై కొట్టిన గ్రామాలు**

గ్రామాల్లో రోడ్డు భద్రతను పెంపొందించేందుకు "నో హెల్మెట్ – నో ఎంట్రీ" నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని పేర్కొంటూ, ఈ చొరవ చూపిన సర్పంచులను, కౌన్సిలర్లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. "మన ఊరు – మన బాధ్యత" కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఈ అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. బుధవారం జరిగిన గ్రామసభల్లో 119 పంచాయతీలు, 09 వార్డుల ప్రతినిధులు, గ్రామస్థులు కలిసి ఏకగ్రీవ తీర్మానాలు చేశారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు, ట్రాఫిక్ నియమాల పక్కా అమలుతో పాటు, గంజాయి అనే మహమ్మారిని గ్రామాల్లోకి రానివ్వకుండా కఠిన చర్యలు చేపట్టాలని ప్రజలు సంకల్పించడం హర్షణీయమన్నారు.

**- గంజాయి రహిత జిల్లాకై ప్రత్యేక బహుమతి**

జిల్లాను గంజాయి రహితంగా మార్చేందుకు పోలీసు శాఖ కఠిన చర్యలు తీసుకుంటోందని ఎస్పీ తెలిపారు. గంజాయి విక్రయాలు లేదా సరఫరాకు సంబంధించి 8712656999 నంబర్‌కు పక్కా సమాచారం అందించిన వారికి రూ.5,000 నగదు బహుమతి అందజేస్తామని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ప్రకటించారు.

**- నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదు**

మైనర్లు వాహనాలు నడపడం, డ్రంక్ అండ్ డ్రైవ్, సీట్ బెల్ట్ ధరించకపోవడం, నంబర్ ప్లేట్లలో మార్పులు చేయడం వంటి చట్టవ్యతిరేక పనులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని ఎస్పీ హెచ్చరించారు. ప్రమాదాల నివారణకు ట్రాక్టర్ల వెనుక భాగంలో ఎరుపు రంగు రిఫ్లెక్టర్ స్టిక్కర్లు ఏర్పాటు చేసుకోవాలని, వాహన పత్రాలను సక్రమంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో రవాణా శాఖ అధికారి శంకర్ నాయక్, గూడూరు సీఐ విజయ్, ఎస్ఐ గిరిధర్, ఎంఆర్ఓ నాగభవాని, స్థానిక సర్పంచ్ సునీత, ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# 2027 నాటికి సాగునీరు

- వచ్చే ఎండాకాలం ఒకే సీజన్ లో మేడిగడ్డ పునరుద్ధరణ పూర్తి చేస్తాం
- ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం
- లోపభూయిష్ట నిర్మాణం వల్లే బ్యారేజీ కుంగిందని గత ప్రభుత్వంపై మండిపాటు
- మేడిగడ్డ బ్యారేజీ సాంకేతిక పరీక్షల పనుల పరిశీలన



అక్షరదర్బార్, మహాదేవపూర్ : గత ప్రభుత్వ తప్పుడు నిర్ణయాలు, లోపభూయిష్ట నిర్మాణాల వల్లే మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయిందని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి నల్లమారి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. అయితే 2027 ఎండాకాలం నాటికి ప్రాజెక్టు మరమ్మతులు పూర్తిగా పూర్తి చేసి, రైతులకు సాగునీరు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు.

బుధవారం మేడిగడ్డ ప్రాజెక్టు పునరుద్ధరణకై జరుగుతున్న సాంకేతిక పరీక్షల పనులను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014 కంటే ముందే కాంగ్రెస్ ప్రభుత్వం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును రూ.38 వేల కోట్లతో చేపట్టిందని, అందులో దాదాపు రూ.11వేల కోట్ల పనులు పూర్తయ్యాయని మంత్రి గుర్తు చేశారు. కానీ 2014 తర్వాత వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం కావాలనే డిజైన్ మార్చి రూ.1,45,000 కోట్లతో మేడిగడ్డ బ్యారేజీ నిర్మించిందని, వారి నిర్లక్ష్యం వల్లే నేడు 16.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందకుండా ఇబ్బంది కలిగిందని మండిపడ్డారు.

**ప్రతిష్టాత్మక సంస్థలతో సాంకేతిక పరీక్షలు**

ప్రాజెక్టు కుంగడానికి గల కారణాలను లోతుగా విశ్లేషించేందుకు సీడబ్ల్యూసీ, ఎన్డీఎస్ఏ వంటి అనుభవం కలిగిన సంస్థలతో అత్యంత పకడ్బందీగా సాంకేతిక పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో ఎలాంటి రాజకీయ దురుద్దేశ్యం లేదని స్పష్టం చేశారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతు పనులను కూడా చేపట్టినట్లు చెప్పారు. పునరుద్ధరణ పనుల కోసం డిజైన్ కన్సల్టెంట్‌గా ప్రపంచ ప్రఖ్యాత 'ఆఫ్రీన్' కంపెనీని సంప్రదించామని, 'ఐఐటీ బాంబే' నిపుణులతో సంయుక్తంగా రీ–డిజైన్ పనులు చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. భారత సైన్యంలో అత్యంత నైపుణ్యం, అనుభవం కలిగిన కల్నల్ పరిషిత్ చైర్మన్‌షిప్‌లో దేశ విదేశాల నిపుణులతో కూడిన కమిటీ ఆధ్వర్యంలో ఈ పరీక్షలు జరుగుతున్నాయని, పనుల పురోగతిని, ఎనర్జీ డిస్ప్లేస్‌మెంట్‌ను పరిశీలించేందుకే నేడు ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు.

**పనుల గడువు - యాక్షన్ ప్లాన్**

జూలై మొదటి వారం అన్ని రకాల సాంకేతిక పరీక్షలు పూర్తి చేసి నివేదిక సిద్ధం చేస్తారు. నవంబర్ – డిసెంబర్ (2026) నివేదిక ఆధారంగా రీ–డిజైన్ చేసి, సీడబ్ల్యూసీ, ఎన్డీఎస్ఏ అనుమతులు తీసుకుని వర్షాకాలం ముగియగానే పనులు ప్రారంభిస్తారు. 2027 ఎండాకాలం ఒకే వర్కింగ్ సీజన్‌లో పనులన్నీ పూర్తి చేసి, 2027 నాటికి సాగునీరు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి చెప్పారు. ఈ తనిఖీ కార్యక్రమంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, ఇరిగేషన్ శాఖ సెక్రెటరీ శ్రీధర్, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఇరిగేషన్ సీఈ శ్రీనివాస్ గుప్తా, ఆర్డీఓ రవీందర్, ఎస్ఈ దస్తగిరి, ఈఈ రమేష్, కన్సల్టెంట్ ఈఈ యాదగిరి, గ్రంథాలయ చైర్మన్ రాజబాబు, తహసీల్దార్ సత్యనారాయణ స్వామి, ఎంపీడీఓ సురేందర్, కాటారం మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుమల తదితరులు పాల్గొన్నారు.



# దేశ ప్రగతికి ‘మోదీ’ పాలనే నిదర్శనం

○ పరకాలలో ప్రత్యేక పూజలు!

12 ఏళ్ల పాలన పూర్తి.. భవానీ కుంకుమేశ్వర స్వామి ఆలయంలో బీజేపీ సంబరాలు

అక్షరదర్బార్, పరకాల (జూన్ 11): ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం 12 సంవత్సరాల సుదీర్ఘ పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా బీజేపీ పరకాల పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో బుధవారం శ్రీ భవాని కుంకుమేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేశాభివృద్ధి, ప్రజల సంక్షేమం, భారతదేశ నిరంతర ప్రగతిని ఆకాంక్షిస్తూ స్వామివారికి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్‌రావు, రాష్ట్ర నాయకుడు డాక్టర్ పెసరు విజయ్ చంద్రరెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం గత 12 ఏళ్లుగా అమలు చేస్తున్న సంక్షేమ, వినూత్న అభివృద్ధి కార్యక్రమాలతో దేశం అన్ని రంగాల్లో అంతర్జాతీయ స్థాయిలో పురోగతి సాధించిందన్నారు. భవిష్యత్‌లో తెలంగాణలో కూడా బీజేపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ జయంతీలాల్, పరకాల మున్సిపల్ కౌన్సిలర్లు కుక్కల విజయ్ కుమార్, బెజ్జంకి పూర్ణాచారి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చందుపట్ల రాజేందర్ రెడ్డి, నాయకులు కాచం గురు ప్రసాద్, ఎర్ర రామన్న, పట్టణ ప్రధాన కార్యదర్శి సంఘ పురుషోత్తం, జిల్లా నాయకులు మార్త రాజభద్రయ్య, కొలనుపాక భద్రయ్య, మెంతుల సురేష్, బాసాని సోమరాజు పాల్గొన్నారు.

# వార్డు సమస్యల పరిష్కారమే లక్ష్యం

○ పరకాలలో ప్రజాభిప్రాయాల సేకరణ

○ ప్రజల భాగస్వామ్యంతోనే సమగ్ర అభివృద్ధి

○ మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్

అక్షరదర్బార్, పరకాల (జూన్ 11): ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పరకాల పురపాలక సంఘం 16వ వార్డులో బుధవారం ప్రజాభిప్రాయాల సేకరణ సమావేశాన్ని ముమ్మరంగా నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ బండి శ్రీధర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రత్యేక కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ పోతరాజు పవన్, చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాల క్షేత్రస్థాయి అమలు, లబ్ధిదారుల అభిప్రాయాల స్వీకరణతో పాటు వార్డు సమగ్ర అభివృద్ధికి అవసరమైన చర్యలపై ప్రజలతో నేరుగా చర్చించినట్లు తెలిపారు. స్థానిక సమస్యలను గుర్తించి వాటి త్వరితగతిన పరిష్కారానికి మొదటి ప్రాధాన్యతనిస్తూ ప్రత్యేక కార్యాచరణ రూపొందించనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకతను పెంచడంతో పాటు ప్రజల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వార్డు అధ్యక్షుడు బండి రాజు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఐలపల్లి స్వామి, గోవింద్ ఉపేందర్, శ్రీపతి రాజు, గోవింద ప్రకాశ్ పాల్గొన్నారు. వార్డు ప్రజలు తాగునీరు, పారిశుద్ధ్యం, మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపడతామని అధికారులు హామీ ఇచ్చారు.





# సినిమా షూటింగులకు ‘ములుగు గడ్డ’

○ పర్యాటక సౌందర్యానికి అడ్డా!

○ అందుగులమేది పరిసరాల్లో షూటింగ్ ముమ్మరం..


○ చిత్ర దర్శకుడు నేరెళ్ల దేవేందర్

అక్షర దర్బార్, వెంకటాపూర్ (జూన్ 11): ములుగు జిల్లా ప్రకృతి రమణీయత, ఇక్కడి చారిత్రక ప్రాంతాలు సినిమా షూటింగులకు అత్యంత అనువైనవని చిత్ర దర్శకుడు నేరెళ్ల దేవేందర్ కొనియాడారు. ఫైన్ స్టూడియో బ్యానర్‌పై రూపొందుతున్న "ప్రొడక్షన్ నెం. 2" సినిమా షూటింగ్ గత కొద్దిరోజులుగా వెంకటాపూర్ మండలంలోని పలు ప్రాంతాల్లో ముమ్మరంగా కొనసాగుతోంది. ఈ క్రమంలో బుధవారం అందుగులమేది గ్రామ పరిసర ప్రాంతాల్లోని అందమైన వాతావరణంలో సినిమా చిత్రీకరణ జరిపారు. హీరో, హీరోయిన్లపై పలు కీలక సన్నివేశాలను గ్రామ శివారులోని ఓ మంచె వద్ద డైరెక్టర్ దేవేందర్ ఆధ్వర్యంలో యూనిట్ సభ్యులందరూ అద్భుతంగా చిత్రీకరించారు. ఈ సందర్భంగా దర్శకుడు నేరెళ్ల దేవేందర్ మాట్లాడుతూ.. ములుగు జిల్లాలో రామప్ప దేవాలయం లాంటి అనేక అరుదైన పుణ్యక్షేత్రాలతో పాటు పర్యాటక ప్రాంతాలు ఉన్నాయన్నారు. అలాంటి ములుగు గడ్డపై సినిమా చిత్రీకరణ జరిపే అవకాశం లభించడం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొడ్యూసర్ వేణు యాదవ్, కో డైరెక్టర్ ఆర్య అరవింద్, లిరిక్స్ రైటర్ రాజ్ కుమార్, మూవీ ఎడిటర్ యూనిక్, డీఓపీ తరుణ్, అసిస్టెంట్ డైరెక్టర్ లోకేష్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ గౌతమ్, యూనిట్ సభ్యులు సిద్దు, రఘు, రాహుల్ పాల్గొన్నారు.

# వర్షాకాలంలో ‘సాహసాలు’ వద్దు..

○ వాగులు, విద్యుత్ తీగల పట్ల అప్రమత్తంగా ఉండాలి

○ చిట్యాల ఎస్ఐ పోచంపల్లి సతీష్ సూచనలు



అక్షర దర్బార్, చిట్యాల (జూన్ 11): వర్షాకాలం ప్రారంభమైనందున మండల ప్రజలందరూ వ్యక్తిగత రక్షణ కోసం పలు కీలక జాగ్రత్తలు పాటించాలని చిట్యాల ఎస్ఐ పోచంపల్లి సతీష్ కోరారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. వర్షాలకు రోడ్లపై నీరు చేరినప్పుడు, ముఖ్యంగా కల్వర్టులు, వాగులు ప్రవహిస్తున్నప్పుడు నీటి ఉధృతిని అంచనా వేయడం కష్టం కాబట్టి, సాహసాలు చేసి వాటిని దాటడానికి ప్రయత్నించవద్దన్నారు. భారీ వర్షాలు కురిసేటప్పుడు అత్యవసరమైతే తప్ప రాత్రి వేళల్లో ప్రయాణాలు చేయకపోవడమే మంచిదన్నారు. వీధుల్లో ఉండే విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, వేలాడే విద్యుత్ తీగలను ఎవరూ తాకవద్దని, పశువులను కూడా వాటికి దూరంగా ఉంచాలన్నారు

# జీవితానికి బీమా రక్షణ



అక్షర దర్బార్, వెంకటాపూర్ (జూన్ 11): ప్రతి కుటుంబ యజమాని తమ జీవితానికి బీమా చేసి కుటుంబానికి ధీమాగా ఉండాలని శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ డీజీఎం సతీష్ పిలుపునిచ్చారు. వెంకటాపూర్ మండలంలోని నల్లగుంట గ్రామానికి చెందిన బానోత్ రమేష్ శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ నందు పాలసీ కలిగి ఉండి, ఇటీవల అనారోగ్య కారణాలతో ఆకస్మికంగా మరణించారు. మరణించిన రమేష్ కుటుంబానికి శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ద్వారా మంజూరైన సుమారు రూ. 7,36,000 ల డెత్ క్లెయిమ్ చెక్కును నామిని అయిన రమేష్ భార్యకు స్థానిక సర్పంచ్ భూక్య శ్రీదేవి చేతుల మీదుగా గురువారం ఘనంగా అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీదేవి ఇన్సూరెన్స్ కంపెనీ సత్వర స్పందనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ డివిజనల్ మేనేజర్ బండి వినయ్, ములుగు బ్రాంచ్ మేనేజర్ ప్రశాంత్ కుమార్, డీవోలు రాజు, రజిత, నారాయణస్వామి, జగదీష్, మంజుల, తిరుమల, ఎస్ఓలు సుజాత, వినీల్ కుమార్, ఎగ్జిక్యూటివ్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

# ఉపాధి కూలీలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు వహించాలి

○ నాచినపల్లి చెరువు పనులను పరిశీలించిన సర్పంచ్ పెండ్యాల రాజు

అక్షర దర్బార్, దుగ్గొండి (జూన్ 11): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా పనులు చేస్తున్న కూలీలు మారుతున్న వాతావరణం దృష్ట్యా తమ ఆరోగ్యం పట్ల పలు జాగ్రత్తలు తీసుకుంటూ కాపాడుకోవాలని నాచినపల్లి గ్రామ సర్పంచ్ పెండ్యాల రాజు సూచించారు. బుధవారం నాచినపల్లి గ్రామ చెరువులో జరుగుతున్న ఈజీఎస్ పనులను ఆయన గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, ఈజీఎస్ క్షేత్ర సిబ్బందితో కలిసి ప్రత్యక్షంగా పరిశీలించారు. కూలీల పనితీరును చూసి వారికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కూలీలతో ముఖాముఖి మాట్లాడుతూ.. ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు సకాలంలో బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు పడుతున్నాయా లేదా అంటూ అడిగి తెలుసుకున్నారు. సాంకేతిక కారణాల వల్ల ఎవరికైనా డబ్బులు పడకపోతే వెంటనే తనకు తెలియజేయాలని, తాను మండల అధికారులతో మాట్లాడి వెంటనే డబ్బులు పడేలా చూస్తానన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న ఈజీఎస్ పథకాన్ని గ్రామీణ నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జీపీ పాలకవర్గ సభ్యులు, సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.



# ప్రభుత్వ బడికి 'మైసంపల్లి' మహత్తర ప్లాన్

- పిల్లలను చదివిస్తే 'ఇంటి పన్ను' మాఫీ!
- జిల్లాలోనే ప్రథమ వినూత్న తీర్మానం.. సర్పంచ్ వేముల ఇంద్రదేవ్ సంచలన నిర్ణయం

అక్షర దర్బార్, దుగ్గొండి (జూన్ 11): ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు, విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు దుగ్గొండి మండలంలోని మైసంపల్లి గ్రామపంచాయతీ దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఒక అద్భుతమైన వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మైసంపల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల తల్లిదండ్రులకు మాత్రమే వారి ఇంటి పన్నును పూర్తిగా మినహాయింపు (మాఫీ) చేస్తున్నట్లు గ్రామ సర్పంచ్ వేముల ఇంద్రదేవ్ ప్రకటించారు. బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన పాలకవర్గ అత్యవసర సమావేశంలో ఈ చారిత్రాత్మక వినూత్న కార్యక్రమానికి ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ స్కూళ్లను పరిరక్షించడంలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ప్రభుత్వ యూపీఎస్ మైసంపల్లి పాఠశాలలో పిల్లల్ని చదివించే తల్లిదండ్రులకు ప్రభుత్వ పథకాల అమలులో కూడా మొదటి ప్రాధాన్యత ఉంటుందని హామీ ఇచ్చారు. అలాగే రానున్న వర్షాకాలం దృష్ట్యా ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్ మంగ్య నాయక్, పంచాయతీ కార్యదర్శి శ్రీలత, ఏఈఓ హన్మంత్, ఉప సర్పంచ్ బొల్లంపల్లి ఆనందం, వార్డు సభ్యులు చింతం సుమలత, ఈద సురేందర్, గంగారపు రజిత, ఇటుకల రమేష్, బోయిని రజిత, కోడి విజయలత పాల్గొన్నారు. ఇదే వేదికపై గ్రామ పంచాయతీ కార్యాలయానికి నూతనంగా 20 కుర్చీలను ఉచితంగా విరాళంగా అందజేసిన 5వ వార్డు సభ్యుడు ఇటుకల రవిని పాలకవర్గం ప్రత్యేకంగా సన్మానించింది.



# ఇకపై 'నో ఫ్రెండ్లీ పోలీసింగ్'

- నేరగాళ్లతో ఫ్రెండ్లీగా ఉండే ప్రసక్తే లేదు.. రౌడీలపై ఉక్కుపాదం మోపుతాం
- తెలంగాణలో ముగిసిన నక్సలిజం అధ్యాయం.. గ్రేహౌండ్స్ ఉపసంహరణ
- సైబర్ నేరగాళ్లు.. డ్రగ్స్ మాఫియాపై ప్రత్యేక ఫోకస్
- డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడి

అక్షరదర్బార్, హైదరాబాద్ : తెలంగాణ పోలీస్ శాఖలో సరికొత్త సంస్కరణలకు శ్రీకారం చుడుతున్నట్లు రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. మారుతున్న కాలం, మారుతున్న నేరాల సరళికి అనుగుణంగా పోలీసింగ్ వ్యూహాలను పూర్తిగా మారుస్తున్నామని ఆయన ప్రకటించారు. శాంతిభద్రతల పరిరక్షణ, భద్రతా విభాగాల పునర్వ్యవస్థీకరణపై డీజీపీ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఇకపై 'నో ఫ్రెండ్లీ పోలీసింగ్'.. రౌడీలపై ఉక్కుపాదం మోపుతామని అన్నారు. "సామాన్య ప్రజల పట్ల మర్యాద.. నేరగాళ్ల పట్ల కఠినం"గా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే రౌడీలు, గుండాలు, అసాంఘిక శక్తుల పట్ల ఇకపై ఎలాంటి 'ఫ్రెండ్లీ' ధోరణి ఉండబోదని తేల్చిచెప్పారు. శాంతిభద్రతలను చేతుల్లోకి తీసుకునే వారి పట్ల పోలీసులు అత్యంత కఠినంగా వ్యవహరిస్తారు. చట్టాన్ని గౌరవించే సామాన్య ప్రజలను పోలీసులు ఎల్లప్పుడూ గౌరవిస్తారని, వారికి పూర్తి అండగా ఉంటారని డీజీపీ భరోసా ఇచ్చారు.

**- రాష్ట్రంలో మావోయిజం అంతం..**




తెలంగాణ రాష్ట్రంలో ఒకప్పుడు తీవ్ర సవాల్‌గా నిలిచిన నక్సలిజం ప్రస్తుతం పూర్తిగా అంతమైందని డీజీపీ అధికారికంగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో పోలీస్ శాఖలో అతిపెద్ద పునర్వ్యవస్థీకరణకు తెరలేపారు. నక్సలైట్ల ఏరివేత కోసం దశాబ్దాలుగా అద్భుతమైన సేవలు అందించిన ఎలైట్ ఫోర్స్ 'గ్రేహౌండ్స్' విభాగాన్ని ఇకపై ఉపసంహరిస్తున్నట్లు (తీసేస్తున్నట్లు) వెల్లడించారు. గ్రేహౌండ్స్ విభాగంలో ఉన్న సుమారు 1,700 మంది సుశిక్షితులైన సిబ్బందిని ప్రస్తుత అవసరాల దృష్ట్యా పోలీస్ శాఖలోని ఇతర కొత్త, ప్రత్యేక విభాగాలకు బదిలీ చేస్తున్నట్లు డీజీపీ పేర్కొన్నారు.

**గంజాయి, డ్రగ్స్‌పై యుద్ధం**

రాష్ట్ర భవిష్యత్తుకు శాపంగా మారిన మాదకద్రవ్యాల మహమ్మారిని ఉపేక్షించేది లేదని డీజీపీ హెచ్చరించారు. గంజాయి, డ్రగ్స్ రవాణా, వినియోగాన్ని పూర్తిగా నివారించడానికి ప్రత్యేక కార్యాచరణను రూపొందిస్తున్నట్లు తెలిపారు. డ్రగ్ నెట్‌వర్క్‌లను పూర్తిగా ధ్వంసం చేయడమే లక్ష్యంగా ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. సాంకేతికత ఎంతగా పెరుగుతోందో, అంతే వేగంగా సైబర్ నేరాలు కూడా విస్తరిస్తున్నాయని డీజీపీ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పోలీస్ శాఖకు సైబర్ క్రైమ్ అతిపెద్ద సవాల్‌గా మారిందని ఆయన అంగీకరించారు. ఆర్థిక మోసాలు, ఆన్‌లైన్ వేధింపులకు అడ్డుకట్ట వేసేందుకు వీలుగా పోలీసు సిబ్బందికి అత్యాధునిక సాంకేతిక శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు.

# రాజీ మార్గమే రాజమార్గం..

- ఈ నెల 20న 'న్యాయ సేవా సదస్సు'
- కోర్టు కేసుల పరిష్కారానికి సువర్ణావకాశం
- మొగుళ్లపల్లి సబ్ ఇన్‌స్పెక్టర్ ముప్పు సురేష్

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి (జూన్ 11): ఈ నెల 20వ తేదీన జిల్లా చట్టపరమైన సేవల అధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ (న్యాయ సేవా సదస్సు) కార్యక్రమాన్ని మండల పరిధిలోని కక్షిదారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం



చేయాలని మొగుళ్లపల్లి సబ్ ఇన్‌స్పెక్టర్ ముప్పు సురేష్ ఒక ప్రకటనలో కోరారు. కోర్టులలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల రాజీపడదగిన నేర పరిశోధన కేసులు, నకిలీ పత్రాల కేసులు, విద్యుత్ బిల్లుల గొడవలు, వాహన ప్రమాద బీమా క్లెయిమ్‌లు, భూమి తగాదాలు, వివిధ బ్యాంక్ రుణాల వసూళ్ల కేసులు మరియు భార్యాభర్తల వైవాహిక కుటుంబ వివాదాలను ఇరుపక్షాలు కలిసి ఈ సదస్సు ద్వారా సామరస్యపూర్వకంగా, ఉచితంగా పరిష్కరించుకోవచ్చని ఆయన వివరించారు.

# వీఓ భవన నిర్మాణంపై 'శారద' ఆగ్రహం

- అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలి
- ఇందిరమ్మ ఇళ్లలో బంధుప్రీతి వద్దని డిమాండ్

గూడూరు : మండల పరిధిలోని చక్కృతండా గ్రామపంచాయతీలో బుధవారం జరిగిన ప్రజాపాలన గ్రామసభలో స్థానిక సమస్యలపై 6వ వార్డు సభ్యురాలు లకావతు శారద గళమెత్తారు. గ్రామంలో నెలకొన్న ప్రధాన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామపంచాయతీలో ఎలాంటి అధికారిక తీర్మానం లేకుండా ఇష్టానుసారంగా పనులను ఎలా చేపడుతున్నారని తీవ్రంగా ప్రశ్నించారు. ముఖ్యంగా గత ప్రభుత్వం పంచాయతీ అవసరాల కోసం కేటాయించిన విశాలమైన స్థలంలో, ఎలాంటి తీర్మానం లేకుండా మహిళా సంఘం (వీఓ) భవన నిర్మాణాన్ని నిర్మించడం ఏంటని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ భవనాన్ని వేరే స్థలంలో నిర్మిస్తే బాగుండేదని సూచించారు. అదేవిధంగా రాబోయే ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో ఎలాంటి




బంధుప్రీతి చూపించకుండా, రాజకీయ పార్టీలకతీతంగా అర్హులైన పేదలందరికీ ఇళ్లను మంజూరు చేయాలని శారద గట్టిగా డిమాండ్ చేశారు. గతంలో ఇల్లు నిర్మించుకుని ఆర్థిక ఇబ్బందుల వల్ల అసంపూర్తిగా వదిలేసిన నిరుపేదలను కూడా ఇందిరమ్మ పథకం పరిధిలోకి తీసుకువచ్చి, ప్రభుత్వం ప్రకటించిన రూ. 3 లక్షల ఆర్థిక సహాయాన్ని తక్షణమే అందజేయాలని అధికారులను కోరారు. ఈ వినూత్న గ్రామసభ కార్యక్రమంలో పంచాయతీ పాలకవర్గ ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు మరియు చకృతండా గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తప్పు చేసిన వారికి 'శిక్ష' తప్పదు

- నాణ్యమైన దర్యాప్తు జరపాలి

జిల్లా నేర సమీక్షా మీటింగ్‌లో పోలీస్ అధికారులకు ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆదేశం

అక్షర దర్బార్, భూపాలపల్లి (జూన్ 11): జిల్లాలో నేరాల నియంత్రణకు పోలీస్ అధికారులు ప్రత్యేక నిఘా పెట్టాలని, ప్రతీ కేసులో ఎలాంటి సిఫార్సులకు తావులేకుండా నాణ్యమైన దర్యాప్తు జరిపి బాధ్యులకు చట్టబద్ధంగా న్యాయం జరిగేలా చూడాలని జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ సిరిశెట్టి సంకీర్త్ ఆదేశించారు. భూపాలపల్లి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ నేర సమీక్షా సమావేశంలో ఆయన జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పనితీరు, పెండింగ్ కేసుల పురోగతిపై సమగ్ర సమీక్ష జరిపారు. శాంతిభద్రతలను పటిష్టంగా ఉంచేందుకు ప్రతీ కేసు వివరాలను సకాలంలో నమోదు చేసి సమాచారాన్ని ఎప్పటికప్పుడు పొందుపరచాలన్నారు. గంజాయి రవాణా, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాల్లో పాల్గొనే వారిపై ఉక్కుపాదం మోపాలని హెచ్చరించారు. ప్రమాదాల నివారణకు రోడ్లపై ప్రమాదకరమైన మలుపులను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని, తాగి వాహనాలు నడిపే వారిపై తనిఖీలు పెంచాలన్నారు. గ్రామ స్థాయి పోలీసింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు పోలీస్ సూపరింటెండెంట్ నరేష్ కుమార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.